సాక్షి బాపట్ల

ఆదివారం । 28 । జూలై । 2024



పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయానికి శనివారం ముఖద్వార ఏర్పాటుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డీజీపీని కలిసిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావును మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నేడు మహాలక్ష్మమ్మ తిరునాళ్ల



దాచేపల్లి : ప్రజల కొంగు బంగారమైన మహాలక్ష్మమ్మ తిరునాళ్ల ఆదివారం జరగనున్నది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మత్స్యకార భృతి.. భ్రాంతియేనా!

వేట నిషేధ సమయం ముగిసి నెలన్నర దాటింది



సముద్రంలో చేపల వేటలో మత్స్యకారులు

- అయినా భృతి ఇవ్వని కూటమి సర్కారు
- ఎన్నికల ముందు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తామంటూ ప్రకటన
- గద్దెనెక్కాక పట్టించుకోని వైనం
- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4 వేల భృతి
- వైఎస్.జగన్ పాలనలో రూ.10 వేలకు పెరిగిన భృతి
- నాలుగేళ్ల కాలంలో రూ.46.854 కోట్లు ఇచ్చిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలంటున్న మత్స్యకారులు

వైఎస్.జగన్ పాలనలో క్రమం తప్పకుండా భృతి

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకార భృతి క్రమం తప్పకుండా అందజేశారు. అంతకు ముందు టీడీపీ పాలనలో ఒక్కొక్కరికి కేవలం రూ.4 వేల భృతి ఇచ్చేవారు. వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచారు. అది కూడా ఏప్రిల్-15 నుంచి జూన్-14 వరకూ వేట నిషేధ సమయం ముగిసిన వెంటనే ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఇచ్చారు. నాలుగు సంవత్సరాల కాలంలో 46,854 మంది మత్స్యకారులకు రూ.46.854 కోట్లు భృతి కింద అందజేశారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికారంలోకి వచ్చిన వెంటనే చేపల వేట సాగించే మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఏరుదాటాక తెప్పతగలేసిన చందంగా తయారైంది. మత్స్యకారుల వేట నిషేధ భృతి సంగతి గాలికి వదిలేసింది. నిషేధ సమయం ముగిసి నెలన్నర దాటుతున్నా భృతి సంగతి పట్టించుకోలేదు. మత్స్యశాఖ అధికారులు గతంలో మాదిరిగా 2024-25 ఏడాదికిగాను మత్స్యకారుల జాబితాలు పంపినా కూటమి పాలకులు స్పందించలేదు. జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి తర్వాత నిర్ణయం వెలువరిస్తామని ఉన్నతాధికారులు దాటవేస్తున్నారు. ఈ పరిస్థితిలో పరిశీలన ఎప్పుడు జరుగుతుందో? నిరుద్యోగ భృతి ఎప్పటికి అందుతుందో? తెలియని పరిస్థితిలో జిల్లాలోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వేట నిషేధ సమయం ముగిసిన వెంటనే భృతి అందేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం భృతి ఎప్పటికి ఇస్తుందో? అర్థం కావడంలేదని వారు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లేయించుకొని ఇప్పుడు స్పందించకపోవడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గెలిపిస్తే రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు

కూటమిని గెలిపిస్తే వేట నిషేధ భృతి రూ.20 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికల సమయంలో తీర ప్రాంతాల్లో దీనిపై పెద్దఎత్తున ప్రచారం చేశారు. కూటమికి ఓట్లేయాలని వేడుకున్నారు. కూటమి నేతల మాటలు నమ్మి మత్స్యకారులు ఓట్లేసి గెలిపించారు. మాట నిలుపుకోవాల్సిన చంద్రబాబు అండ్ కో మత్స్యకారులకు ఇచ్చిన రూ.20 వేల హామీని తుంగలో తొక్కింది. ప్రశ్నిస్తే జాబితాలు, పరిశీలనలు, కుదింపులు, తర్వాత నిర్ణయాలు అంటూ దాటవేస్తున్నారు. ఎప్పటికిస్తారో చెప్పడంలేదు. అసలు అందరికీ ఇస్తారా? లేక జాబితాలపై ఆంక్షలు పెట్టి కుదిస్తారా? ఒకవేళ కుదించినా వారికైనా భృతి ఎప్పుడిస్తారు? అనే విషయాలేవీ వెల్లడించడంలేదు. దీన్ని బట్టి చూస్తే మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఎప్పటికి అందుతుందో అంతుబట్టడంలేదు.

జిల్లాలో మత్స్యకారుల సంఖ్య ఇలా...

బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, రేపల్లె, నిజాంపట్నం మండలాల పరిధిలో మత్స్యకారులు అధికంగా ఉన్నారు. నగరం, చెరుకుపల్లి, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు, చుండూరు ప్రాంతాల్లో స్వల్పంగా ఉన్నారు. మొత్తంగా పైమండలాల పరిధిలో 13 వేలకు పైచిలుకు మత్స్యకారులు ఉన్నారు. వలసల నేపథ్యంలో ఈ సంఖ్య ప్రతిఏటా మారుతుంటుంది.

మండలాల వారీ మత్స్యకారుల సంఖ్య

మండలం	2020-21	2021-22	2022-23	2023-24
బాపట్ల	1028	1056	1115	1369
చీరాల	2660	1813	1713	1843
వేటపాలెం	1135	1126	1023	976
చినగంజాం	1043	1146	1026	983
రేపల్లె	2341	1845	1490	1824
నిజాంపట్నం	4873	4753	3163	5065
నగరం	10	19	18	10
చెరకుపల్లి	4	4	4	3
వేమూరు	10	10	12	9
అమృతలూరు	3	3	4	0
భట్టిప్రోలు	52	52	62	40
కొల్లూరు	26	26	31	22
చుండూరు	3	3	5	0
	13,188	11,856	9666	12,144

వైఎస్.జగన్ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్లలో **46,854** మందికి రూ.**46.854** కోట్లు ఇచ్చారు.

2024-25 ఏడాదికి ప్రతిపాదించిన మత్స్యకారులు జాబితా

బాపట్ల	1399
చీరాల	1990
చినగంజాం	1035
వేటపాలెం	1073
నిజాంపట్నం	5224
రేపల్లె	1519
మొత్తం	12,540 మంది

వీరికి కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.25 కోట్ల 8 లక్షలు భృతి కింద చెల్లించాలి.

కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి



ప్రతి మత్స్యకారుడికి వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు మాటిచ్చారు. ఆయన మాట నమ్మి ఓట్లేశాం. నిషేధం గడువు ముగిసి నెలన్నర కావస్తున్నా డబ్బులు ఇవ్వలేదు. వెంటనే ప్రభుత్వం డబ్బులు ఇవ్వాలి. గత ప్రభుత్వంలో మాకు నిషేధం ముగిసిన వెంటనే డబ్బులు వేసేవారు. ప్రతి సంవత్సరం అలాగే ఇచ్చారు. ఈ ప్రభుత్వం వెంటనే డబ్బులు ఇచ్చి మాట నిలుపుకోవాలి.

–బొమ్మిడాల బాలరాజు, మత్స్యకారుడు, నిజాంపట్నం.

ఆదుకున్న వైఎస్సార్ మత్స్యకార భరోసా



2019 నుంచి ఐదేళ్లపాటు వేట నిషేధ సాయం ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.10వేలు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించి ఆదుకున్నారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నిషేధం ముగిసి నెలన్నర కావస్తున్నా వేట నిషేధ సాయం అందించలేదు. ఎప్పుడు ఇస్తారో...ఎలా ఇస్తారో...అసలు ఇస్తారో...లేదో..అని ఎదురుచూపులు చూస్తున్నాం. ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చాలి. మత్స్యకారులకు ఇచ్చిన హామీని కూటమి నిలబెట్టుకోవాలి.

–సున్నపు మోజెస్, మత్స్యకారుడు, చీరాల మండలం.

న్యూస్‌రీల్

శింగరకొండలో హైకోర్టు న్యాయమూర్తి



అద్దంకి రూరల్: హైకోర్టు న్యాయమూర్తి కొనకంటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం రాత్రి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా జడ్జి ఏ.భారతి, న్యాయమూర్తులు దేవస్థాన అధికారులు న్యాయమూర్తి స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి, అద్దంకి ప్రోటోకాల్ న్యాయమూర్తి ఎస్ ప్రియదర్శిని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.సీత తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్ కాలేజీని సందర్శించిన విద్యా శాఖ కమిషనర్

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికైన సందర్భంగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ శనివారం సందర్శించారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన న్యాక్ ప్లస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. తీర ప్రాంతం రేపల్లెలోని డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికకావడం అభినందనీయమన్నారు.

నవోదయలో రెండు రోజుల వైజ్ఞానిక ప్రదర్శన

చిలకలూరిపేట(యడ్లపాడు): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి...నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక పోటీలను ఏర్పాటు చేసినట్లు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సోమ, మంగళ వారాల్లో నవోదయ విద్యాసమితి పరిధిలోని ఏడు ఉమ్మడి జిల్లాల స్థాయిలో క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. సైన్స్, సోషల్, మ్యాథ్స్, ఎస్‌యూపీడబ్ల్యూ, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శితమవుతాయన్నారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యార్థులు హాజరై తాము తయారుచేసిన ప్రాజెక్టుల్ని ఈ పోటీలకు తీసుకువస్తారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీలను తిలకించేందుకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. విజేతలు క్లస్టర్‌స్థాయి నుంచి జేఎన్‌వీ ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.

నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు



బాపట్ల : నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని నల్లమడ డ్రెయిన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణ చర్యల్లో భాగంగా డ్రెయిన్ లాకులు మరమ్మతు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

హాస్టల్‌లో ఫోన్ ద్వారా స్పాట్ అడ్మిషన్

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా మురికిపూడి గ్రామంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి కె. రాజాబాబు చెప్పారు. హాస్టల్‌లో ఎస్సీ -12, ఎస్టీ- 3, ఓసీ-4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఫోన్ చేసి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇందు కోసం ఫోన్ నంబర్ 74165 16599లో సంప్రదించాలన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ పాలిసెట్-2024 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఈనెల 31న అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్ ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్‌ఈ బ్రాంచ్‌ల్లో సీట్లు భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం

పురుగుమందులు, ఎరువుల వాడకం పెరిగింది. దీంతో సారవంతమైన భూమి నిస్సారమవుతుంది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటన్నింటికి చెక్ పెట్టడమే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక రచించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా రైతన్నను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ప్రకృతి సేద్యం ఆశాజనకంగా ముందుకు సాగుతోంది.



నవధాన్యాల పంట

- పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా చర్యలు
- సాగు పెరిగేలా ప్రకృతి సేద్య సిబ్బంది ప్రణాళిక
- 2024-25 ఏడాదిలో 52వేల ఎకరాల సాగు లక్ష్యం



ప్రకృతి సేద్యంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

నరసరావుపేట రూరల్: జిల్లాలో రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. పంటల సాగుకు సహకారం అందిస్తూ వ్యవసాయ పరంగా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అందరూ కృషి చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పిస్తూ ఏటేటా ప్రకృతి వ్యవసాయ సాగును జిల్లాలో విస్తరింపచేస్తున్నారు. దీంతోపాటు పండ్ల తోటలు, కూరగాయల పంటలు, ప్రధాన పంటల్లో అంతర పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

జిల్లాలో 28మండలాల పరిధిలో...

జిల్లాలో 28 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిరప, జొన్న, శనగ పంటలను ప్రధానంగా సాగుచేస్తున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాల పంటల సాగు చేస్తే భూమికి అవసరమయ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. ఫలితంగా వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పర్యవేక్షణలో జిల్లాలో 305 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 222 గ్రామాల్లో 1074 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు వివిధ పంటల సాగులో రసాయన ఎరువులను మోతాదుకంటే అధికంగా వాడటం వలన భూసారం కోల్పోయి క్రమేపి పంట దిగుబడి శాతం తగ్గిపోతుంది. దీనికి తోడు ఒకే పంటను సాగుచేస్తుంటడంతో పొలాల్లో పోషకాల అసమతుల్యత ఏర్పడింది. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటల సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. వీటి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు మొక్కకు అందించడంతో పాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి నేల ఆరోగ్యం కాపాడుతాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో చాలా మంది రైతులు ప్రధాన పంటలకు ముందుగా నవధాన్య పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47వేల నవధాన్య కిట్లను 39వేల మంది రైతులకు పంపిణీ చేశారు. దాదాపు40 వేల ఎకరాల్లో నవధాన్య పంటలను ఈ ఏడాది సాగు చేయనున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా జులై చివరి వరకు ఈ నవధాన్య పంటల సాగు మరింత విస్తీర్ణంలో చేయనున్నారు.

2024-25 సంవత్సరంలో పంటల సాగు లక్ష్యం

సాగయ్యే పంటలు	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో
వరి (బోర్ల కింద)	6330	8643
వరి (ఎన్ఎస్‌పి కాలువ)	6661	4507
పత్తి	19,483	23,317
మిరప	13,421	13,750
ఇతర పంటలు	3626	1783
మొత్తం	49,521	52,000

నవధాన్య పంటల సాగుతో ప్రయోజనాలు ఇలా..

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యమవుతాయి
- సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.
- ఏడాది పొడవునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది.
- నవధాన్యాల సాగుతో వేళ్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంటల సాగులో చీడపీడలు ఆశించవు.
- జీవన వైద్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి.
- పైరుకు మేలు చేసే సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ బలపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.

లక్ష్యం మేర సాగుకు కృషి



ప్రకృతి సేద్యంలో భాగంగా జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లకు 49,521 మంది రైతులతో 52వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యంగా నిర్దేశించాం. ఈ మేరకు ప్రకృతి సిబ్బందితో కలిసి లక్ష్య సాధనకు కృషిచేస్తాను.

– కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం, జిల్లా ప్రాజెక్ట్ అధికారి

ర్యాగింగ్ కేసులో ఐదుగురి అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు
- ర్యాగింగ్‌తోపాటు అట్రాసిటీ చట్టం వర్తింపు

నరసరావుపేటటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటన కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేశారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా శనివారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థి సీహెచ్.పాల్‌థామస్‌పై సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన విషయం విదితమే. దాడులకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావటంతో సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి వరకు వసతి గృహంలో ఎన్నో ఏళ్లుగా చీకట్లో జరుగుతున్న ర్యాగింగ్ ఒక్కసారిగా బయటపడినట్టయింది. బాధితుడి ఫిర్యాదుతో సీనియర్ విద్యార్థులు సత్తెనపల్లి గోపీకృష్ణ, దర్శి చెందు, రమావత్ అంజినాయక్, యారగాని అజయ్‌కుమార్, యనమల నరేంద్రరెడ్డి, అజయ్‌లపై ఈనెల 24న కేసు నమోదు చేశారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ స్వయంగా కళాశాల హాస్టల్‌కు వెళ్లి ర్యాగింగ్ ఘటనపై ఆరా తీశారు. ఎన్‌సీసీ ఉన్నతాధికారులు సైతం సంఘటనపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఈక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు నిందితుల అరెస్ట్, కేసు పురోగతికి అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతిని నియమించారు. బాధితుడు దళితుడు కావటంతో అట్రాసిటీ చట్టాన్ని జోడించారు. ఘటనలో కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ ఆఫీసర్, వార్డెన్ ప్రమేయంపై అంతర్గత విచారణ చేస్తున్నట్టు సమాచారం.

వినుకొండ నుంచి మహానందికి ప్రత్యేక బస్సు

వినుకొండ(నూజెండ్ల):వినుకొండ డిపో నుంచి మహానంది, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, సిద్ధయ్యమఠం యాత్రకు ప్రత్యేక బస్సు ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 9 గంటలకు వినుకొండ నుంచి బస్సు బయలుదేరి 10వ తేదీ ఉదయం మహానంది, 11గంటలకు యాగంటి, సాయంత్రం అహోబిలం, రాత్రికి ఒంటిమిట్ట చేరుకుంటారన్నారు. 11వ తేదీ ఉదయం రాముల వారి దర్శనం చేసుకొని మధ్యాహ్నానికి బ్రహ్మంగారి మఠం, సిద్ధయ్య మఠాలను దర్శించుకొని 12వ తేదీ ఉదయం తిరిగి వినుకొండకు చేరుకుంటారని తెలిపారు.

ఒలింపిక్స్‌లో అద్భుత ఫలితాలు సాధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, క్రీడాకారులు, శిక్షకులు

లక్ష్మీపురం: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో భారతదేశ పతాకాన్ని మరింత ఎత్తుకు ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. ఒలిపింక్స్ క్రీడా పోటీలకు వెళ్లిన వారి వెంట ప్రతి ఒక్క భారతీయుడు ఉన్నారని అన్నారు. అదే విధంగా దేశ వ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, స్థానికులు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక కోసం కొట్టుకున్న టీడీపీ నేతలు

అద్దంకి రూరల్: ఇసుక ఫ్రీ అనేసరికి తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. అందిన కాడికి దోచుకుపోవాలని తహతహలాడుతున్నారు. అద్దంకి పట్టణం గుండ్లకమ్మ నది తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానుల మధ్య శుక్రవారం రాత్రి మాటామాటా పెరిగింది. ఒకరిపై ఒకరు ఘర్షణ పడి గాయాలపాలై అద్దంకి ప్రభుత్వ వైద్యాశాలలో చేరారు. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఘర్షణ పడ్డవారిలో ఒకరు అద్దంకికి చెందిన వార్డు కౌన్సిలర్ కాగా మరొకరు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వారు ఇద్దరు అధికార పార్టీసానుభూతి పరులు కావడం విశేషం. మంత్రిగారి తాలుకా అని తెలియడంతో సంబంధిత అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారు.

గజ ఈతగాళ్ల అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ



బాపట్ల టౌన్: గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే తీరంలో ప్రమాదాల్ని నివారించగలమని బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు సూర్యలంక సముద్ర తీరంలో శనివారం ఆయన గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత పోలీస్ ఔట్ పోస్ట్, టవర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వారాంతాల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లకు వచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సముద్ర తీరాల్లో గజ ఈతగాళ్లను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. ఎరుపు రంగు జెండాలను దాటి ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. సముద్ర తీరంలో సమర్థంగా గస్తీ నిర్వహించాలని తెలిపారు. ఆకతాయిలు పర్యాటకుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

గేదెను ఢీకొని ఉపాధ్యాయుడి మృతి



తిమిడెదపాడు (కారంచేడు): చీకటిలో రోడ్డుపై వెళ్తున్న గేదెల్ని గమనించని ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి బోటు స్వర్ణ–తిమిడెదపాడు మధ్యలో జరిగింది.ప్రమాదానికి కారణమైన గేదె సైతం అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. ఇంకొల్లు మండలం వంకాయలపాడుకు చెందిన ఈదర శ్రీనివాస రెడ్డి (56) అదే మండలం కొణికి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శనివారం విధులు ముగించుకున్న ఆయన చీరాలలో ఈ–ఫైయిలింగ్ నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. కారంచేడు మండలం స్వర్ణ–తిమిడెదపాడు గ్రామాల మధ్యన గేదెను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి ఉన్న శ్రీనివాసరెడ్డిని ఆ రహదారిలో చాలా సేపటి వరకు ఎవరూ గమనించలేదు. దీంతో ఆయన తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్నారు. స్థానికులు గమనించి 108 సాయంతో చీరాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

- అభివృద్ధికి అనువుగా పెనుమూడి రేవు
- ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి
- నది మధ్యలో సహజ సిద్ధంగా దీవులు
- బోటు షికారుకు అనువైన ప్రాంతం
- రమణీయ దృశ్యాలతో సినిమా షూటింగ్‌లకు అనువైన దృశ్యాలు
- గతంలో పలు సినిమాల చిత్రీకరణ



పెనుమూడి రేవు వద్ద ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహం

పెనుమూడి రేవు.. ఆహ్లాదానికి నెలవు

రేపల్లె రూరల్: కృష్ణమ్మ పరవళ్లను తాకుతూ వీచే చల్లటి గాలులు .. కంటికి కనువిందు చేసే సహజ సిద్ధ దీవులు.. పక్షుల కిలకిల రాగాలు.. నదిలో విహరించడానికి నావలతో పర్యాటకుల హృదయాన్ని ఇట్టే ఆకర్షిస్తోంది మండలంలోని పెనుమూడి రేవు. తీర ప్రాంతంలో వారాంతపు సమయాల్లో కుటుంబాలతో విహార యాత్రకు చక్కని అనువైన ప్రాంతం. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభిస్తుంది. తీర ప్రాంతంలో పలువురు యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. ప్రస్తుత పాలక ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.



రేవుకు అవతల కృష్ణానది మధ్యలో సహజసిద్ధంగా ఏర్పడిన దీవి

అందానికి నెలవుగా దీవులు

పెనుమూడి ప్రాంతంలో కృష్ణానది మధ్యలో సహజ సిద్ధంగా ఏర్పడ్డ దీవులు పచ్చని చెట్లతో మరింత అందాల్ని సంతరించుకున్నాయి. మహాబలేశ్వరంలో పుట్టిన కృష్ణమ్మ కృష్ణా జిల్లా హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. అయితే, దీనికి ముందు కృష్ణా జిల్లా పులిగడ్డ–బాపట్ల జిల్లా పెనుమూడి మధ్యలో మూడు పాయలుగా చీలి ప్రవహిస్తుంది. వీటి మధ్యలో సహజ సిద్ధంగా ఏర్పడిన దీవులు చూపరుల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి. వేసవిలో పర్యాటకులు కుటుంబాలతో కలసి ఇక్కడ సరదాగా గడుపుతూ ఉంటారు. అయితే, దీవుల్లో మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం వీటిని కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. పెనుమూడి రేవును పర్యాటక కేంద్రంగా రూపొందిస్తే ఆధ్యాత్మిక కేంద్రాగానూ మారే అవకాశం ఉంది. దక్షిణ కాశీగా పేరుగాంచిన మోర్తోట శివాలయానికి రోడ్డు మార్గానే కాకుండా నదిలో బోటులోనూ ప్రయాణించి చేరుకోవచ్చు. రేవు ప్రాంతంలో ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, రామాలయంలతో పాటు నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయాల్ని సందర్శించునేందుకు భక్తులకు అవకాశం ఉంది

సినీ షూటింగ్‌లకు అనువైన ప్రాంతం

చుట్టూ పచ్చటి పొలాలతో పాటు జల జల పారే కృష్ణమ్మ పరవళ్లతో ఆకర్షణీయంగా ఉన్న ఈ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు అనువైనది. గతంలో పలు సినీ, టెలీ ఫిలింల షూటింగ్‌లు పెనుమూడి రేవు ప్రాంతం, పెనుమూడి–పులిగడ్డ వారధిపై జరిగాయి. గతంలో 'జయ జానకీ నాయక' సినిమాలో ఒక సన్నివేశం వారధిపై చిత్రీకరించారు. 'పండు గాడు ఫోటో స్టూడియో' సినిమాలోని పలు సన్నివేశాలను పెనుమూడి రేవుతో పాటు దీవులలో చిత్రీకించారు. వీటితో పాలు పలు టెలీ ఫిలింల షూటింగ్‌లు జరిగాయి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తే మరిన్ని సినీ షూటింగ్‌లో చేసుకునేందుకు అవకాశం ఉంది.

పర్యాటకులు పెరిగే అవకాశం

పెనుమూడి రేవు ఒడ్డున అరకిలో మీటర్లు పొడవున రూ.6కోట్ల వ్యయంతో ఘాట్ నిర్మాణంతో పాటు లైటింగ్, ఘాట్‌కు చేరుకునేందుకు రహదారులు ఉన్నాయి. ప్రస్తుతం పెనుమూడి ఘాట్ ప్రాంతాన్ని పార్కుగా మలిచి బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వేసవిలో తీర ప్రాంతానికి చెందిన వారు సరదాగా గడపాలంటే విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సమీపంలో అవకాశాలు ఉన్నా వసతులు లేకపోవడంతో ఆహ్లాదం కరువవుతున్నదని పలువురు పేర్కొంటున్నారు. పెనుమూడి రేవును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ టూరిజం దృష్టి సారించాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పెనుమూడి గ్రామ శివారు

బోటు షికారులకు అనువైన ప్రాంతం



పెనుమూడి రేవు ప్రాంతం

పెనుమూడి రేవు బోటు షికారుకు ఎంతో అనువైన ప్రాంతం. సముద్రం రేవుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఆటు పోట్లు ప్రభావంతో ఈ ప్రాంతంలో నీటి పరిమాణం ఏమాత్రం తగ్గదు. ప్రస్తుతం పర్యాటకులు సాధారణ పడవలు మాట్లాడుకుని తూర్పు వైపున ఉన్న దీవిలోకి వెళ్లడంతో పాటు నదిలో ప్రయాణించి సరదాగా గడుపుతూ ఉంటారు. ఆ ప్రాంతంలో బోటింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఆధ్యాత్మిక కేంద్రంగానూ రూపుదిద్దుకునే అవకాశం

పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటు

బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా ప్రతినిధి షేక్ సైదావలి



మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం– 2020లో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సారథ్యంలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా ప్రతినిధి షేక్ సైదావలి పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశంలో మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, టీచర్ కోఆర్డినేటర్‌గా 20 నుంచి 50 మంది విద్యార్థులతో ఎకో క్లబ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నీరు, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ, భూమి, గాలి, ఆహారంపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటి పర్యవేక్షణ బాధ్యతల్ని అప్పగించడం ద్వారా పర్యావరణంపై అవగాహన కలిగించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త వి. సత్యసాగర్, హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్, తెలుగు ఉపాధ్యాయుడు చట్టి శ్రీనివాసరావు, సీఆర్పీ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

మంగళగిరి: గుంటూరు జిల్లాలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిచేసిన కేసులో పోలీసులు తాజాగా శనివారం విజయవాడకు చెందిన మోదుగుల గణపతిరావు, పసుపులేటి ఏసు, వరికూటి నాగిరెడ్డిని అరెస్ట్ చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచారు. నిందితులపై పోలీస్‌లు పెట్టిన రిమాండ్‌ను కోర్టు తిరస్కరించి, బెయిల్ మంజూరు చేయడంతో ముగ్గురు విడుదలయ్యారు.

అంకితభావంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు

జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ కె.వెంకటేశ్వర్లు

జే.పంగులూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పంగులూరు, కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలల ఆవరణలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. కొండమంజులూరు హెచ్‌ఎం ఐ. అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎకో క్లబ్ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠ్య ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషిచేయాలని తెలిపారు. పాఠశాల పనితీరును పరిశీలించి హెచ్‌ఎంను అభినందించారు.



విద్యార్థి తల్లిదండ్రులతో మొక్క నాటిస్తున్న డీఈఓ

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ప్రవీణ్ ఎంపిక

చీరాల రూరల్: జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు చీరాల విఠల్‌నగర్‌కు చెందిన మీఎస్వీ ప్రవీణ్ ఎంపికయ్యాడు. పట్టణంలోని ఎస్‌ఆర్‌అండ్‌సీఎం హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. గత నెలలో బాపట్ల జిల్లా జట్టు తరపున జోనల్ పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరు జిల్లా పేరేచర్లలో గతనెల 6న నిర్వహించిన జోనల్ పోటీల్లో ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల జట్లను ఓడించి జట్టును విజేతగా నిలిపాడు. అతని క్రీడా ప్రతిభను గమనించిన నిర్వాహకులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. విజయవాడలో గతనెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టును నాలుగో స్థానంలో నిలిపాడు. ఇందులో ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారుల్ని ఎంపికచేసి అనంతపురంలోని ఫుట్‌బాల్ శిబిరంలో శిక్షణనిచ్చారు. వారిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌ను రాష్ట్రం తరపున జాతీయ జట్టుకి ఎంపిక చేశారు. అసోం రాష్ట్రంలో ఈనెల 28 నుంచి ఆగస్టు 10వ వరకు జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రవీణ్ పాల్గొంటాడని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసిమల్లి విజయకుమార్, జోనల్ కో–ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. ప్రవీణ్‌ను క్యాంప్ ఇన్‌చార్జ్ బి. ప్రేమయ్య, కోచ్ ప్రసన్న, సీనియర్ క్రీడాకారుడు ఎస్. నరేష్‌తో పాటు క్రీడాకారులు అభినందించారు.



పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. సుధీర్



జే.పంగులూరు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. సుధీర్ సూచించారు. మండలంలోని నూజెళ్లపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్ ప్రతినిధులు పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా, గుంత తీసి పాతి పెట్టాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు శరీరానికి చలిగాలి సోకకుండా బట్టలతో గానీ, దుప్పటితో గానీ కప్పుకోవాలని చెప్పారు. మంచినీటి బావులు, చెరువుల్లో చెత్తాచెదారం వేయరాదని తెలిపారు. అనారోగ్యం బారిన పడితే తక్షణమే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఇంటిపై బెంగతో హాస్టల్ వదిలివెళ్లిన విద్యార్థిని

- అన్ని కోణాల్లో దర్యాప్తు
- సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ డెబోరా



విద్యార్థిని నుంచి వివరాలు సేకరిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజడెబోరా

రేపల్లె రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం –2 నుంచి విద్యార్థిని అదృశ్యమై తల్లిదండ్రుల వద్దకు చేరిన ఘటనపై సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజడెబోరా, ఆర్డీవో హెలా షారోన్, పట్టణ సీఐ నజీర్ బేగ్ శనివారం విచారణ నిర్వహించారు. నిడమర్రుకు చెందిన కాకర్లమూడి సియోను కుమారి వసతి గృహంలో ఉంటూ ట్రిబుల్ ఎస్ హైస్కూలులో 8వ తరగతి చదువుతోంది. ఇంటిపై బెంగతో శుక్రవారం మధ్యాహ్నం హాస్టలు నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. పెనుమూడి రోడ్డు వరకు కాలినడకన వెళ్లింది. అక్కడ నుంచి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై దుగ్గిరాల వెళ్లింది. అతడు టీ తాగేందుకు వాహనం ఆపగా విద్యార్థి భయపడి అక్కడి నుంచి పారిపోయి స్థానికుల్ని ఆశ్రయించింది. వారు తల్లికి సమాచారం అందించి నిడమర్రుకు చేర్చారు. వసతి గృహంలో విద్యార్థిని అదృశ్యంపై వార్డెన్ లక్ష్మీప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు తెలిసిన వ్యక్తితో కమాటీ విద్యార్థినిని పంపించిందని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అధికారులు ఖండించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారించామని పేర్కొన్నారు. అయితే, ఉదయం ఆర్డీవో హెలా షారోన్ విద్యార్థినిని విచారించిన సందర్భంలో హాస్టలులోని కమాటీ తనను అపరిచిత వ్యక్తితో బండిపై పంపించినట్లు పేర్కొందని విలేకర్లు ప్రస్తావించారు. భయంతో అలా చెప్పిందని, తాము అన్ని కోణాలలో విచారణ నిర్వహించామని చెప్పారు. అయితే, గతంలో కూడా ఇద్దరు విద్యార్థినుల్ని అపరిచిత వ్యక్తులతో కమాటీ పంపించినట్లు ఫిర్యాదులు ఉన్నాయని ప్రశ్నించగా, అలాంటి సంఘటనలేవీ లేవని తెలిపారు. బాలికల హాస్టళ్లలో వార్డెన్‌లు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థినులకు భద్రత పెంచుతామని చెప్పారు.

100 గ్రాముల బంగారం చోరీ

మంగళగిరి: పాత మంగళగిరి దేవుడి మాన్యంలో చోరీ ఘటన చోటు చేసుకుంది. శనివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవుడి మాన్యంలో నివసిస్తున్న పంది బాబాజీరావు కుటుంబం పిల్లలతో కలిసి ఈ నెల 20 తేదీన శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లారు. ఇది గమనించిన దుండగులు తాళం వేసి ఉన్న ఇంటిలోకి వెనుక తలుపు పగలకొట్టి ప్రవేశించారు. బీరువా పగలకొట్టి అందులోని రూ.7లక్షల విలువైన 100 గ్రాముల బంగారంతో పాటు రూ. 43 వేలు దోచుకెళ్లారు. బాబాజీరావు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలకొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.